క్లుప్తంగా

ఆలయంలో సామూహిక కుంకుమ పూజ



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ముదిగొండ: మండలంలోని కమలాపురంలోని శ్రీ అంకమ్మ దేవాలయంలో ఆదివారం రాత్రి సామూహిక కుంకుమపూజ కార్యక్రమం నిర్వహించారు. కమలాపురం, అయ్యగారిపల్లి గ్రామాలకు చెందిన మహిళలు సామూహిక కుంకుమపూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు బొర్రా వాసుదేవాచార్యుల శిష్య బృందం హరికిరణాచార్యులు, వంశీకృష్ణ లు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మితో పాటు మహిళలు పాల్గొన్నారు.

19వ రోజుకు చేరిన దీక్ష



దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కల్లూరు: డబుల్ బెడ్ రూమ్ గృహాల ఎంపికలో జరిగిన అవకతవకలపై పలువురు లబ్ధిదారులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష ఆదివారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షా శిబిరాన్ని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కౌన్సిల్ సెక్రటరి రావి నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు లింగబోయిన పుల్లారావు, కాంగ్రెస్ నాయకులు దామాల రాజు, భూక్యా శివకుమార్ నాయక్‌లు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లబ్ధిదారులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలన్నారు. లేకపోతే ఎలాంటి పోరాటానికైనా సిద్ధమేనని హెచ్చరించారు.

రిలే నిరాహార దీక్షను జయప్రదం చేయండి

సత్తుపల్లి: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు కోసం ఈ నెల 14న ఖమ్మం ధర్నాచౌక్‌లో ఉదయం 9 గంటలకు జరిగే ఒక రోజు రిలే నిరాహార దీక్షను జయప్రదం చేయాలని సత్తుపల్లి మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఖమ్మంజిల్లా ఆర్యవైశ్య మహాసభ పిలుపు మేరకు ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ రిలే నిరాహార దీక్షలు చేశారు. ఈ దీక్షకు సత్తుపల్లి పట్టణ, మండల ఆర్యవైశ్య సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

బీజేపీని గద్దె దించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

ఏన్కూరు: వచ్చే ఎన్నికల్లో బీజేపీ గద్దె దించడమే లక్ష్యంగా పనిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. కేంద్ర వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 17న చేపట్టే జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలన్నారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దారాధత్తం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, బానోత్ బాలాజీ, రాములు, లెనిన్, చిన్న రవి, జయ పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలి

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు పరీక్షలంటే భయం వీడి మనోధైర్యం, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని కళాశాల కరస్పాండెంట్ కూసంపూడి మధుసూదన్ అన్నారు. పట్టణంలోని గాయత్రి కళాశాలలో ఆదివారం ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల వీడ్కోల సమావేశం ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కళాశాల డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, ఎం.శ్రీధర్, జి.వీరారెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కారేపల్లి: భార్యను వేధిస్తున్న భర్తపై కారేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. దీనికి సంబంధించిన పోలీసులు తెలిపిన మేరకు గుట్టకింద గుంపు గ్రామానికి చెందిన ఈసం సాగర్‌ను తన భార్య శ్వేతను గత కొంత కాలంగా శారీరకంగా, మానసికంగా వేధిస్తూ భౌతిక దాడులకు పాల్పడుతున్నాడు. దీంతో భార్య శ్వేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచ్చు బిగుస్తోంది..

- 44 సర్వే నంబర్లపై రిజిస్ట్రేషన్‌కు బ్రేక్
- ధరణి ఆపరేటర్‌పై చర్యలకు సిఫారసు
- దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేసిన రెవెన్యూ ఉద్యోగులు



గంగారంలో భూ అక్రమాలపై విచారణ జరుపుతున్న కల్లూరు ఆర్డీఓ సూర్యనారాయణ (ఫైల్)

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ పరిధిలో జరిగిన అక్రమాలు ఇటీవల బయటపడగా.. తీగ లాగితే డొంక కదిలిందన్న చందంగా అధికారుల విచారణలో విస్తుపోయే అంశాలు బయటపడినట్లు సమాచారం. దీంతో తప్పుడు సర్వే నంబర్లతో జరిగిన రిజిస్ట్రేషన్లు అన్నింటినీ రద్దు చేయించేలా అధికారులు నివేదిక సిద్ధం చేశారు. అలాగే, 14.2 ఎకరాలకు సంబంధించిన బేతుపల్లి రెవెన్యూలోని 44 సర్వే నంబర్లపై తదుపరి రిజిస్ట్రేషన్లు చేయకుండా బ్లాక్ చేసేందుకు అధికార యంత్రాంగం ఉపక్రమించింది. అసలు భూమి లేకుండా మిగులు భూమి ఉన్న రైతుల పేరిట నాలా కన్వర్షన్ చేసుకొని రిజిస్ట్రేషన్లు చేసి క్రయవిక్రయాలు జరిపినట్లు విచారణ నివేదికలో పేర్కొనడంతో వాటిని కూడా బ్లాక్ చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. కాగా, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమిలో నిర్మాణాలకు ఇచ్చిన విద్యుత్ కనెక్షన్లను తొలగించాలని విద్యుత్‌శాఖ ఏడీఈ భూక్యా ప్రసాద్‌బాబు ఇప్పటికే సిబ్బందిని ఆదేశించారు.

మా భూములను రక్షించండి..

గ్రామానికి చెందిన సమయమంతుల సాంబశివరావు సర్వేనంబర్ల వారీగా తమ కుటుంబానికి చెందిన భూముల వివరాలను కల్లూరు ఆర్డీఓ సూర్యనారాయణకు లిఖిత పూర్వకంగా అందించారు. ఈ భూములను అక్రమంగా ఇతర సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకోవడమే కాక ఇతరులకు అమ్మేస్తున్నందున రక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో మిగులు భూముల పేరుతో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ లావాదేవీలపై అధికారులు విచారణ జరిపి నివేదికను కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు అందించారు. కాగా, సాంబశివరావు ఫిర్యాదుతో అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్ల వ్యవహారం విచారణ మరింత సులువైంది.

ఆపరేటర్‌పై కేసు నమోదైనా..

సత్తుపల్లి మండలం బేతుపల్లి సర్వే నంబర్ 133/64/4లో ముత్తా వెంకటేశ్వరరావు పేరిట ఉన్న రెండు ఎకరాల భూమిని సమయమంతుల హరికృష్ణకు సత్తుపల్లి తహసీల్ కార్యాలయ ఆపరేటర్ చెన్నారావు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. గత నెల 15న అందిన ఫిర్యాదుతో అదే నెల 21న చెన్నారావు, హరికృష్ణపై కేసు నమోదు చేశారు. కానీ కేసు నమోదు చేసి చేతులు దులుపుకుని.. తదుపరి చర్యలు తీసుకోకపోవడంతో విమర్శలు వస్తున్నాయి. కనీసం ధరణి ఆపరేటర్ చెన్నారావును విధుల నుంచి తొలగించకపోవడంతో బాధితుల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. ఇక పోలీసులు కేసు నమోదు చేయగానే అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు గత నెల 16న ముత్తా వెంకటేశ్వరరావు పేరిట భూమిని తిరిగి రిజిస్ట్రేషన్ చేయించినా చట్ట ప్రకారం చర్యలు లేకపోవటంతో బాధితుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. అయితే, ఈ విషయమై కల్లూరు ఆర్డీఓ సూర్యనారాయణను వివరణ కోరగా.. ఆపరేటర్‌పై చర్యలకు సిఫారసు చేశామని, త్వరలోనే విధుల నుంచి తొలగిస్తామని తెలిపారు.

దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు..

బేతుపల్లి రెవెన్యూలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్, ఇతర అంశాల్లో బాధ్యులకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు దూదిపాల రాంబాబు, వనమా సాధనకుమార్ తదితరులు సీఎస్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఐటీ, ఏసీబీ ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌కు ఫిర్యాదులు పంపించారు. బేతుపల్లి రెవెన్యూలో జరిగిన అక్రమ లావాదేవీలు, అధికారుల పాత్రలపై ఫిర్యాదుల్లో పేర్కొన్నట్లు సమాచారం.

హరిణికి ఉత్తమ మహిళా అవార్డు



నిస్సి హరిణిని అభినందిస్తున్న సంస్థ బాధ్యులు

మధిర: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలో జన అధికార సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మధిర పట్టణంలోని ఆదరణ సేవా ఫౌండేషన్ నిర్వాహకురాలు నిస్సిహరిణికి ఉత్తమ మహిళా అవార్డు అందజేశారు. మధిర ప్రాంతంలో కరోనా సమయంలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను ఆమెకు ఐఏఎస్ అధికారి పి.నరహరి చేతుల మీదుగా అవార్డును అందజేశారు. ఆమెను సన్మానించి మెమొంటో బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతోమంది అనాథ మృత దేహాలకు అంత్యక్రియలు నిర్వహించడంతోపాటు అనాధ ఆశ్రమాన్ని నిర్వహిస్తూ సమాజ సేవకు కృషి చేస్తుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇండస్ ఫౌండేషన్ అధినేత రాకేష్ రెడ్డి, శ్రీనివాస్, కన్నతల్లి ఫౌండేషన్ నిర్వాహకులు రాజన్ బాబు, విద్యా ఫౌండేషన్ నిర్వాహకులు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కే ఫౌండేషన్ చేయూత



వీల్‌చైర్‌ను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్, కౌన్సిలర్లు

సత్తుపల్లిటౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో నడుము పడిపోయి మంచానికే పరిమితమైన పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన నన్నేసాహెబ్‌కు ఆర్‌కే ఫౌండేషన్ చేయూతను అందించింది. తన ఇద్దరి పిల్లలను చదివించుకోలేక అవస్థలు పడుతున్న అతనికి ఫౌండేషన్ నిర్వాహకుడు రాధాకృష్ణ సోషల్ మీడియా ద్వారా రూ.80వేలు సేకరించాడు. ఈ నగదును ఆదివారం మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ చేతుల మీదుగా అందించి ఆ కుటుంబం జీవనోపాధి కోసం ఒక టిఫిన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా మున్సిపల్ చైర్మన్ మహేష్, కౌన్సిలర్లు ఛాంద్‌పాషా, మౌలాలీ, ఆనందరావు, రాంబాబులు కలిసి అతనికి వీల్‌చైర్ అందించారు. అతని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మౌనిక, వరలక్ష్మి, సైదేశ్వరి, సీత, స్వాతి, దీపిక, అజయ్, సంజన, వేణు పాల్గొన్నారు.

మాలదాసులు ఐక్యంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసుదాసు

కల్లూరు: మాలదాసులంతా ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని మాలదాసుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసుదాసు పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు మార్కెట్‌యార్డ్ ఆవరణలో కల్లూరు, ఏన్కూరు మండలాల మాలదాసుల సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. మాలదాసుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, మాలదాసులు అన్ని రంగాలలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో మాలదాసు సంక్షేమ సంఘం నాయకులు వెంకటదాసు, మోహనదాసు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, పుల్లారావు, శ్రీను, కృష్ణ, దశరధ్ పాల్గొన్నారు.

పొంగులేటి ఆత్మీయ సమ్మేళనానికి తరలిన కార్యకర్తలు

తల్లాడ: సత్తుపల్లిలో ఆదివారం జరిగిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆత్మీయ సమ్మేళన సభకు తల్లాడ మండలం నుంచి కార్యకర్తలు తరలి వెళ్లారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల నుంచి పలు వాహనాల్లో కార్యకర్తలు వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వరరావు, నరసింహారావు, వెంకటనారాయణ, లక్ష్మీరెడ్డి, బ్రహ్మారెడ్డి, మహబు, రమేష్, శ్రీనివాసరావు, కృష్ణయ్య, రమణ, యాకూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఆదివారం బీఆర్‌ఎస్ కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బండి సంజయ్ శవయాత్ర నిర్వహించి మహిళలచే చెప్పులు, చీపుర్లతో కొడుతూ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పలువురు పార్టీ నాయకులు మాట్లాడుతూ.. బండి నోరు అదుపులో పెట్టుకోకపోతే తెలంగాణ మహిళల చేతిలో భంగపాటు తప్పదని హెచ్చరించారు. – సాక్షి నెట్‌వర్క్



వైరా: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ఎమ్మెల్యే రాములునాయక్



ఏన్కూరు: బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు



కారేపల్లిలో..

మండలంలో జెడ్పీ చైర్మన్ పర్యటన

ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం జెడ్పీచైర్మన్ లింగాల కమల్ రాజు పాటు కూరాకుల నాగభూషనం కూడా పర్యటించారు. గ్రామాల్లోని కార్యకర్తలను కలిసి మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం పలు శుభకార్యలకు హాజరైయ్యారు. ఇటీవల మృతి చెందిన, గాయపడిన కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో మధిర ఏఎంసీ చైర్మన్ నాగేశ్వరరావు, మాజీ చైర్మన్ రామకృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాంబశివరావు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో విజయాబాయి పర్యటన..

కారేపల్లి: మండలంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరురాలు బానోత్ విజయాబాయి ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఆదివారం రెండు సంవత్సరాల క్రితం సంతోష్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతనిని, బీసీ కాలనీలో వృద్ధుడు వెంకన్న అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అనంతరం పలు శుభకార్యాలకు హాజరైయ్యారు. కార్యక్రమంలో ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యులు హనీఫ్, మజీద్‌పాషా, శ్రీనివాసరెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం



బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బోనకల్: మండలంలోని కలకోట గ్రామంలో గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ సహకారంతో గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ వైద్యశిబిరాన్ని యంగల దయానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుదా మాట్లాడారు. బీపీ, షుగర్, బ్రెస్ట్ కేన్సర్, స్కానింగ్ తదితర పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎర్నెస్ట్‌పాల్, పైడిపల్లి కిషోర్ కుమార్, డాక్టర్ శ్రీకాంత్, సాంకేతిక సిబ్బంది, ప్రొఫెసర్ అమరయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బనిగండ్లపాడులో గురువు రఫీ పాషాను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పదో తరగతి 1988–89 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకనొకరు పలకరించుకొని గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం వారి గురువులను శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో సుదర్శన్, నర్సింహారావు, సాంబశివారెడ్డి, సత్యంబాబు, విజయకుమార్, కృష్ణారెడ్డి, శ్రీను, శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

శీనన్న తడాఖా చూపిస్తాం

సత్తుపల్లిటౌన్: బీఆర్‌ఎస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో శీనన్న తడాఖా చూపిస్తామని డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు అన్నారు. సత్తుపల్లిలోని సిద్ధారం రోడ్‌లో పొంగులేటి ఆత్మీయ సమ్మేళన సభలో ఆయన మాట్లాడారు. అధికారం ఎవరిసొత్తూ కాదని స్పష్టం చేశారు. గుంటనక్కలు అన్నీ కలిసి సింహాన్ని వేటాడాలని చూస్తున్నాయని.. అది సాధ్యంకాదన్నారు. వైఎస్‌ఆర్ సీపీ ఎంపీగా గెలిచి తనతో పాటు నలుగురు ఎమ్మెల్యేలను గెలిపించుకున్న సత్తా శీనన్నదని పేర్కొన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ మాట్లాడుతూ.. పొంగులేటి శ్రీనివాసరెడ్డి పయనమెటని.. ఈ రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో చర్చ జరుగుతుందన్నారు. ఇంతకాలం బీఆర్‌ఎస్ పార్టీ శ్రీనన్నను ఎలా వాడుకున్నారో.. ఆ పార్టీ నాయకుల ఆలోచనా విధానాలు ఏమిటో ప్రజలు గమనిస్తున్నారన్నారు. పొంగులేటి శ్రీనన్న ఏ పార్టీలో చేరినా పదికి పది స్థానాలు గెలిపించుకుంటామన్నారు.



మాట్లాడుతున్న మువ్వా విజయబాబు

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



మాట్లాడుతున్న మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్

సత్తుపల్లిరూరల్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారమని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సత్తుపల్లిలోని రేజర్ల, యతాలకుంట, చెరుకుపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గడప గడపకు తిరుగుతూ రాహుల్ గాంధీ సందేశాన్ని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారమే ధ్యేయంగా ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలో వచ్చిన తర్వాత అన్ని ధరలను పెంచి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పారావు, మండల, పట్టణ అధ్యక్షులు శివవేణు, కొత్రపాటి సాల్మన్‌రాజు, హాలావత్ వెంకటేశ్వర్లు, సర్పంచ్ ప్రభాకర్, దామోదర్‌రెడ్డి, రామకృష్ణ, ప్రసాద్, శ్రీను, బాబురావు, మల్లేష్, రమేష్, కోటేశ్వరరావు, రాజేష్, కృష్ణకుమారి, పద్మ, లక్ష్మారెడ్డి, కుమారి, రాంమోహన్‌రెడ్డి, రెహ్మాన్, హరిబాబు, హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసు నుంచి బయటపడేందుకే కవితపై అభిమానం

సత్తుపల్లి: లిక్కర్ స్కాంలో కూరుకుపోయిన ఎమ్మెల్సీ కవితపై సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వల్లమానిన అభిమానం చూపించటం తన ఓటుకు నోటు కేసు నుంచి బయటపడటం కోసమేనని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు ఆరోపించారు. సత్తుపల్లిలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఫిరాయించి వచ్చి అధినేత కేసీఆర్ మెప్పు కోసం ఎమ్మెల్యే సండ్ర ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ని వీరంరాజు, జిల్లా కార్యదర్శులు నాయుడు రాఘవరావు, సుదర్శన్ మిశ్రా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు

నియామకం..

ఆలయ కమిటీ చైర్మన్‌గా ప్రసాద్‌రావు..



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గం

మధిర: పట్టణంలోని సీతారామచంద్ర స్వామి ఆలయ నూతన పాలకవర్గం ఆదివారం ఆలయంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టింది. ఆలయ కమిటీ చైర్మన్‌గా మధిర సేవా సమితి అధ్యక్షుడు పల్లపోతు ప్రసాద్‌రావును నియమించారు. ఆయనతోపాటు నూతన పాలకవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టారు. వారి చేత ఆలయ కార్యనిర్వహణాధికారి జగన్మోహన్‌రావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు పాల్గొని మాట్లాడారు. నూతన పాలకవర్గం ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, మధిర సొసైటీ అధ్యక్షుడు బిక్కి కృష్ణప్రసాద్, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షుడు కనుమూరి వెంకటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, నాయకులు కరివేద సుధాకర్, చిత్తారు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా పతాధికారిగా నరేష్..

కొణిజర్ల: బీజేపీ జిల్లా పతాధికారి(జిల్లా కార్యదర్శి)గా కొణిజర్ల మండల కేంద్రానికి చెందిన బండారు నరేష్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆదివారం ఆయనకు నియామక ఉత్తర్వులు అందించారు. బీజేపీ కొణిజర్ల మండల కన్వీనర్‌గా, వైరా నియోజకవర్గ కన్వీనర్‌గా పని చేసిన నరేష్ జిల్లా కార్యదర్శిగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా నరేష్ కొణిజర్లలో మాట్లాడుతూ.. జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శ్యాంసుందర్‌నాయక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కోవూరి నాగేశ్వరరావు, కొణిజర్ల మండల అధ్యక్షుడు తుప్పతి మల్లిఖార్జున్ తదితరులున్నారు.

గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా యేసు నరేష్ గౌడ్.



నరేష్‌గౌడ్

ముదిగొండ: తెలంగాణ గౌడ సంఘం ముదిగొండ మండల అధ్యక్షుడిగా యేసు నరేష్‌గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని పెద్దమండవకు చెందిన యేసు నరేష్‌గౌడ్‌ని జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ నరసింహారావు గౌడ్ ఖమ్మంలో ఆదివారం జరిగిన గౌడసంఘం సమావేశంలో నియామక పత్రం అందించారు. మండల ప్రధాన కార్యదర్శిగా కుక్కల సాయిబాబు గౌడ్, ఉపాధ్యక్షుడిగా రౌతు వెంకటేశ్వర్లు గౌడ్, కార్యదర్శిగా హరీష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో యేసు నరేష్‌గౌడ్‌ను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి ఏఓ రాజశేఖర్‌గౌడ్‌తో పాటు గౌడ సంఘం ప్రతినిధులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.



అటెన్షన్ ప్లీజ్

ఈ రోడ్డు పరిస్థితి ఇంతేనా..?



వైరా మండలంలోని రెబ్బవరం – ఖానాపురం మార్గమధ్యలోని రిజర్వాయర్ కుడి కాలువ సమీపంలో ఆర్‌అండ్‌బీ పరిధిలోని రహదారి ఒక వైపు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. దీనికి కారణం వైరా – మధిర రాష్ట్రీయ రహదారి మరమ్మతులకు మట్టిని టిప్పర్లతో తోలడమే. రోజు పదుల సంఖ్యలో ఈ రోడ్డుపై మట్టిని తరలించడంతో రోడ్డు కుంగింది. దీని పక్కనే కల్వర్టు కూడా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు. అసలు వైరా – మధిర ఆర్‌అండ్‌బీ రాష్ట్రీయ రహదారికి కొండకొడిమ శివారులో ఉన్న మట్టిని సేకరించాలని మైనింగ్ అధికారులు అనుమతి ఇచ్చారు. కానీ ఈ టిప్పర్లు కొండకొడిమ, రెబ్బవరం గ్రామాల మీద నుంచి వెళ్లకుండా రెబ్బవరం – ఖానాపురం మార్గ మధ్యలో వైరా రిజర్వాయర్ కుడి కాలువ దాటిన తరువాత ఉన్న ఎడమవైపు నుంచి మట్టిని తోలుతున్నారు. ఈ క్రమంలో ఆ రోడ్డు ధ్వసమైంది. కావున సంబందిత అధికారులు కుంగిన రహదారికి మరమ్మతులు చేయించి భారీ వాహనాలు ఇటుగా వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. – వైరారూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : ప్రవీణ్, ఇన్‌చార్జ్ ఆర్అండ్‌బీ జేఈ, వైరా
సెల్ నంబర్ : 7660805013